కొండంత నిశ్చింత

కొండవాలు ప్రాంతవాసుల్లో నేడు ఎంతో నిశ్చింత. గత ఐదేళ్లలో వారి ప్రాంతాల్లో చేసిన అభివృద్ధే ఇందుకు కారణం. గతంలో కొండపై నివసించే వారు రాకపోకలు సాగించడానికి సరైన మార్గమే ఉండేది కాదు. మెట్లు శిథిలమై, రోడ్లు సరిగ్గా లేక ఇబ్బంది పడేవారు. వర్షం వస్తే ఇక అంతే సంగతి అన్నట్లు ఉండేది పరిస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎంతో మార్పు వచ్చింది. నియోజకవర్గ పరిధిలోని కొండవాలు ప్రాంతాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. మెట్లు, రోడ్లతో పాటు కల్వర్టులు, రక్షణగోడలు కూడా నిర్మించడంతో కొండవాలు ప్రాంతవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పరవళ్లు
- మెట్లు, రోడ్లు, రక్షణ గోడల నిర్మాణంతో ప్రజల హర్షాతిరేకాలు

డెవలప్‌మెంట్ వాచ్


పెదగంట్యాడ: రూ.20 లక్షలతో 65వ వార్డు కాకతీయ లోవలో కొండపైకి నిర్మించిన రోడ్డు


పెదగంట్యాడ: రూ.15 లక్షలతో 65వ వార్డు భానోజీ కాలనీలో కొండపైకి నిర్మించిన మెట్ల మార్గం


పెదగంట్యాడ: రూ.49.50 లక్షలతో 74వ వార్డు సిద్ధేశ్వరం నుంచి దయాల్‌నగర్ కొండపైకి నిర్మించిన రోడ్డు


పెదగంట్యాడ: రూ.48 లక్షలతో 74వ వార్డు టీజీఆర్ నగర్ కొండపైకి నిర్మించిన రోడ్డు


గాజువాక : 71వ వార్డు అరుణోదయ కాలనీలో రూ.18 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా నిర్మించిన మెట్ల మార్గం


అగనంపూడి: 85వ వార్డు శ్రీరామ్‌నగర్ కాలనీ కొండవాలు ప్రాంతంలో కాలనీలను అనుసంధానం చేస్తూ రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ


గాజువాక : 70వ వార్డు ఎల్‌బీఎస్ నగర్, దశమి కొండ కొండవాలు ప్రాంతాల్లో కొండచరియల నుంచి రక్షణ కల్పించడం కోసం రూ.30 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా నిర్మించిన రిటైనింగ్ వాల్

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



85వ వార్డులో రోడ్ షోలో పాల్గొన్న అమర్‌నాథ్, రోడ్ షోలో పాల్గొన్న అభిమానులు, కార్యకర్తలు

- సంక్షేమ ప్రదాతకు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధం
- పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి అమర్‌నాథ్
- 85వ వార్డులో రోడ్ షో

అగనంపూడి: ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని రాష్ట్ర మంత్రి, గాజువాక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సంక్షేమ ప్రదాతకు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీలు, అగనంపూడి సెక్టార్-1,2 నిర్వాసిత కాలనీల్లో అమర్‌నాథ్ బుధవారం నిర్వహించిన రోడ్ షోకు అపూర్వ స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, వాటి తోక పార్టీల ఉమ్మడి మేనిఫెస్టోతో ప్రజల్లో ఉన్న అపోహలు తొలగిపోయాయన్నారు. దీంతో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆచరణకు సాధ్యం కాని హామీలను టీడీపీ మేనిఫెస్టోలో పొందుపరచడంతో అన్ని వర్గాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ సంక్షేమ పాలన కోసం ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి ఓటర్లంతా మేం సిద్ధం అంటున్నారన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఇప్పటి వరకు ఆగిందంటే ముఖ్యమంత్రి జగన్ చొరవ అనే విషయం ప్రజలకు అర్థం అయిందన్నారు.

దీర్ఘకాలిక సమస్యలెన్నో పరిష్కారం

ఉక్కు, ఫార్మా నిర్వాసితుల గురించి ఆలోచించే మనసు సీఎంకు ఉందని, అందుకే నిర్వాసితుల దీర్ఘ కాలిక సమస్యలు పరిష్కరించారని అన్నారు. జగనన్న బాటలోనే గాజువాక సమగ్రాభివృద్ధి కోసం స్థానిక మేనిఫెస్టోను రూపొందించామని, తాను బాధ్యతలు చేపట్టగానే అమలు చేస్తానని చెప్పారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, పార్టీ గాజువాక అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు ఇల్లపు ప్రసాద్, 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, బలిరెడ్డి నాగేశ్వరరావు, నక్కా రమణబాబు, మామిడి శ్రీను, గుర్రం శ్రీను, జెర్రిపోతుల సమర, బలిరెడ్డి శ్రీను, గొలగాని శ్రీను, కొశిరెడ్డి రమణారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనాథ బాలలకు అన్నదానం

పెదగంట్యాడ: స్వామి వివేకానంద మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్‌లోని అనాథ బాలలకు తిప్పల అన్నపూర్ణమ్మ, తిప్పల రమణారెడ్డి దంపతులు బుధవారం మధ్యాహ్నం అన్నదానం చేశారు. కొయ్య చిన సత్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమార్తె అన్నపూర్ణమ్మ ఈ కార్యక్రమం నిర్వహించారు.

9 నుంచి భూలోక మాంబ, పోలమాంబ పండగ

పెదగంట్యాడ: జాలరిపల్లిపాలెం, చినపల్లిపాలెం, పెదపల్లిపాలెం గ్రామాల ప్రజల ఆరాధ్య దేవతలు భూలోకమాంబ, పోలమాంబ అమ్మవార్ల పండగ ఉత్సవాలను ఈ నెల 9 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధి కదిరి భూలోక తెలిపారు. ఉత్సవాల పోస్టర్‌ను న్యూ పోర్టు పోలీస్ స్టేషన్ సీఐ దాలిబాబు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ నెల 19న భూలోకమాంబ పండగ, 21న పోలమాంబ పండగను వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఉత్సవాలను పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కదిరి గోలయ్య, చింతపల్లి అచ్చెన్న, కాసారపు సత్తయ్య, సత్తిబాబు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

సింహగిరి.. భక్త ఝరి

- గంధం అమావాస్యకు పోటెత్తిన భక్తులు
- అప్పన్న ప్రతిరూపాలుగా కోలలకు పూజలు


పుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

సింహాచలం: గంధం అమావాస్య పురస్కరించుకుని బుధవారం సింహగిరికి భక్తులు పోటెత్తారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఇలవేల్పుగా పూజించే ఉత్తరాంధ్ర జిల్లాల్లోని మత్స్యకారులు, గ్రామీణ ప్రాంత భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. మంగళవారం రాత్రికే సింహాచలం చేరుకున్న వీరంతా బుధవారం తెల్లవారుజామున కొండ దిగువ వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించారు. స్వామివారి ప్రతిరూపాలుగా వెంట తీసుకొచ్చిన కోలలను పుష్కరిణి గట్టుపై ఉంచి పూజలు చేశారు. వంటలు వండి కోలలకు ఆరగింపు చేశారు. అమృత కలశాలు, పండ్లు సమర్పించారు. కుటుంబసమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. మెట్లమార్గం ద్వారా సింహగిరి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. గరిడీ నృత్యాలు చేస్తూ స్వామిని కీర్తించారు. పుష్కరిణి నుంచి అడవివరం మార్కెట్ కూడలి వరకు ఉన్న మార్గం భక్తజన సంద్రంగా మారింది. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సీఎం జగన్ పాలనలోనే మహిళా సాధికారత


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గుడివాడ అనూష


సమావేశంలో మాట్లాడుతున్న సురేఖ

అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మహిళలకు అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యం కల్పించారని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష అన్నారు. మహిళా సాధికారతకు ఎంతో కృషి చేశారన్నారు. గుడివాడ అప్పన్నకాలనీలోని రామాలయంలో మహిళలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు ఆర్థికాభ్యున్నతి సాధించేందుకు అనేక చర్యలు తీసుకున్నారన్నారు. ఈ సంక్షేమ పాలన కొనసాగించేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి, వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అమర్‌నాథ్ ఎమ్మెల్యేగా గెలిస్తే గాజువాక మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

76వ వార్డులో..

పెదగంట్యాడ: మహిళల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ సోదరి సురేఖ అన్నారు. మహిళా పక్షపాతి అయిన సీఎంకు అండగా నిలవాలని కోరారు. 76వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో కోరాడలో బుధవారం మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌కు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మంత్రి శంకరనారాయణ, రంబ నారాయణమూర్తి, తాటికొండ జగదీష్, కాకినాడ, పెంటారావు, రమణ, ఆనంద్, భవాని తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్సార్‌సీపీ వల్లనే ఉక్కు ప్రైవేటీకరణ ఆగింది'


సమావేశంలో ప్రసంగిస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డ్ ఇన్‌చార్జి శివ

ఉక్కునగరం: రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ వల్ల స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ మూడేళ్లకు పైగా ఆగిందని జీవీఎంసీ 78వ వార్డు ఇన్‌చార్జి రావాడ శివ అన్నారు. సెక్టార్-5లోని పార్టీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021లో కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకోగా.. మొదట స్పందించింది వైఎస్సార్‌సీపీ మాత్రమే అన్నారు. వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధానికి లేఖ రాయడంతో పాటు ప్రత్యామ్నాయాలు సూచించారన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేయడంతో పాటు విశాఖలో జరిగిన ప్రధాని సభలోనూ తన వైఖరిని స్పష్టం చేశారన్నారు.

టీడీపీకి–వైఎస్సార్‌సీపీకి తేడా గమనించాలి

గత చంద్రబాబు హయాంలో ఆందోళన చేసినందుకు పెట్టిన కేసులకు ఇప్పటికీ ఉక్కు కార్మిక నాయకులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని శివ అన్నారు. మూడేళ్లుగా పోరాట కమిటీ ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు, నిరసనలు జరుగుతున్నా ఇంతవరకు ఏ ఒక్కరిపై ఒక్క కేసు కూడా పెట్టలేదంటే వైఎస్సార్ కాంగ్రెస్ వైఖరి అర్థం అవుతోందన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకున్న బీజేపీ కూటమిలో ఉన్న టీడీపీకి ఓటేస్తే పరిణామాలను ఉక్కు ఉద్యోగులే ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీను గెలిపిస్తే తప్పకుండా ప్లాంట్‌ను కాపాడుకుంటామన్నారు. ఉక్కు ఉద్యోగులు టీడీపీకి, వైఎస్సార్‌సీపీకి తేడా గమనించాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎస్.రమేష్‌కుమార్, కె.అమ్మాజీ, కె.ప్రవీణ్, బిషాయ్, బాలయోగి, సత్యనారాయణ, మహాలక్ష్మి నాయుడు, సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' పరిరక్షణ అందరి బాధ్యత


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం : 'విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు' నినాదంతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడం అందరి బాధ్యత అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1181వ రోజు, బుధవారం సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ఉత్పత్తిలో పరుగులు పెడుతూ దేశంలో నెంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందన్నారు. కానీ కేంద్రప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకుండా నష్టాల పేరు చెప్పి సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు చూస్తోందన్నారు. ఐక్య పోరాటాలతో దీనిని అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ప్రచార పర్వం


87వ వార్డు అప్పికొండ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్ తదితరులు - కూర్మన్నపాలెం


వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా 87వ వార్డు కణితి పద్మశాలివీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు - కూర్మన్నపాలెం


గాజువాక నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌కు మద్దతుగా 65వ వార్డులో ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు మంత్రి మంజుల, పిట్ట ప్రకాష్‌రెడ్డి - పెదగంట్యాడ


వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్‌ను, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరుతూ 69వ వార్డు తుంగ్లాంలో ప్రచారం చేస్తున్న స్థానిక నాయకులు కాకి అప్పల రెడ్డి, దుర్గా రెడ్డి, వినోద్ రెడ్డి తదితరులు - అక్కిరెడ్డిపాలెం


స్టీల్‌ప్లాంట్ సెక్టార్-6లో ఇంటింటి ప్రచారం చేస్తున్న 78వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు సాపే బ్రహ్మయ్య, సంపూర్ణం తదితరులు - ఉక్కునగరం


వైఎస్సార్‌సీపీకి మద్దతుగా 85వ వార్డు పినమడక, కొత్తూరు, పూడివానిపాలెం గ్రామాల్లో ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు కండిపల్లి లక్ష్మి, దాముర్రోతు అప్పలరాజు, బొబ్బరి అర్జునరావు, కొశిరెడ్డి రమణారావు తదితరులు - అగనంపూడి


వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌ను గెలిపించాలని కోరుతూ 79వ వార్డు గళ్లవానిపాలెం, శనివాడల్లో ప్రచారం చేస్తున్న మహిళా నాయకురాలు లక్ష్మీ ప్రసన్న - అగనంపూడి

పోస్టల్ బ్యాలెట్‌కు విశేష స్పందన

- ఓటుహక్కు వినియోగించుకున్న సర్వీస్ ఉద్యోగులు, పోలీసు సిబ్బంది

గాజువాక : గాజువాకలో పోస్టల్ బ్యాలెట్‌కు విశేష స్పందన లభించింది. సర్వీస్ ఉద్యోగులు, పోలీసు సిబ్బంది తమ ఓటుహక్కును శతశాతం వినియోగించుకున్నారు. వివిధ విభాగాల ఉద్యోగుల్లో 2411 మందికి ఇక్కడ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించగా, అందరూ వినియోగించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు.

గాజువాకలో పోలింగ్ విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది ఇక్కడే పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకున్నారు.2046 మంది సర్వీస్ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్‌కు అవకాశం కల్పించగా, నూరు శాతం పోలైనట్టు ఆర్వో తెలిపారు. పోలీసులు కూడా నూరు శాతం పోలింగ్‌లో పాల్గొన్నారన్నారు. 357 మందికి గాను మొత్తం పోలీసులు సిబ్బంది తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నట్లు చెప్పారు. తొలుత గాజువాకలో 300 మంది పోలీసులకు ఓటు హక్కు వినియోగానికి అవకాశం కల్పించారు. బుధవారం మరో 57 మందికి ఇక్కడ అవకాశం కల్పించారు. గురువారం వరకు అవకాశం ఉన్నా ముందురోజే మొత్తం సిబ్బంది ఓటింగ్‌లో పాల్గొన్నట్టు ఆర్వో పేర్కొన్నారు. అత్యవసర సర్వీసు విభాగాల్లో పని చేస్తున్న ఎనిమిది మంది సిబ్బంది కూడా ఇక్కడ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ప్రాంతంలో ఓటు హక్కు ఉండి ఇతర జిల్లాల్లో ఎన్నికల విధుల కోసం వెళ్లిన 875 మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్‌లను పంపించినట్టు రిటర్నింగ్ అధికారి తెలిపారు.


జోనల్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం బారులు తీరిన ఉద్యోగులు

ముగిసిన హోం ఓటింగ్

85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగుల్లో 144 మంది తమ ఇళ్లనుంచే ఓటు వేశారు. మొత్తం 152 మందికి హోమ్ ఓటింగ్‌కు అవకాశం కల్పించగా, వారిలో ఐదుగురు మృతి చెందినట్టు తెలిసిందని రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు. మిగిలిన ముగ్గురు తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణలో జోక్యం చేసుకోండి

- కలెక్టర్‌కు 'ఉక్కు' సీఎండీ లేఖ

ఉక్కునగరం: సంక్షోభంలో ఉన్న స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవెన్స్ బ్యాటరీల రక్షణ విషయంలో వెంటనే జోక్యం చేసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం మరోసారి లేఖ రాశారు. కన్వేయర్ బెల్ట్ ద్వారా గాని, వేరే పద్ధతిలో స్టీల్‌ప్లాంట్‌కు బొగ్గు రవాణా చేయాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. ఇప్పటి వరకు అమలుకు నోచుకోకపోవడం చాలా ఆందోళనకరంగా ఉందన్నారు. పోర్టు యాజమాన్యం అక్కడి ఉద్యోగులతో చర్చలు పురోగతిలో ఉన్నాయని చెబుతూనే బొగ్గు రవాణాకు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. బొగ్గు అందుబాటులో లేకపోవడం వల్ల ఉత్పత్తి తీవ్రంగా తగ్గిందని చెప్పారు. తమ సొంత లోడర్లు, డంపర్ల ద్వారా బొగ్గును శాంతియుతంగా తరలించడానికి అవసరమైన భద్రతను అందించాలని జిల్లా పరిపాలన వ్యవస్థను, పోలీసులను లేఖలో సీఎండీ అభ్యర్థించారు.

గంగవరం పోర్టు నుంచి బొగ్గు రవాణాకు అంగీకరించండి

- స్టీల్‌ప్లాంట్ అధికారులు, నాయకుల అభ్యర్థన

ఉక్కునగరం: గంగవరం పోర్టులో ఉన్న స్టీల్‌ప్లాంట్‌కు చెందిన బొగ్గును ప్లాంట్‌కు రవాణా చేయడానికి అంగీకరించాలని గంగవరం పోర్టు కార్మిక సంఘాల నాయకులను ఉక్కు పరిశ్రమ అధికారులు, కార్మిక సంఘాల నాయకులు కోరారు. గత నెల 12 నుంచి గంగవరం పోర్టులో తలెత్తిన కార్మిక వివాదం వల్ల స్టీల్‌ప్లాంట్‌కు చెందిన లక్షల టన్నుల బొగ్గు, ఇతర ముడిపదార్థాల రవాణా నిలిచిపోయింది. బొగ్గు కొరత వల్ల స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవెన్స్ బ్యాటరీల పరిస్థితి అత్యంత క్లిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు బుధవారం ప్లాంట్ నుంచి ర్యాలీగా గంగవరం పోర్టుకు చేరుకున్నారు. అక్కడ ఉన్న గంగవరం పోర్టు నాయకులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ గంగవరం పోర్టు కార్మికులకు తమ నుంచి పూర్తి మద్దతు ఇస్తామన్నారు. ప్రస్తుత ప్లాంట్ క్లిష్ట పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తమ బొగ్గును రవాణాకు అనుమతించాలని చేతులెత్తి నమస్కరించి విజ్ఞప్తి చేశారు. దీనిపై గంగవరం పోర్టు కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు తాము వ్యతిరేకం కాదని, తమకు జిల్లా యంత్రాంగం నుంచి స్పష్టమైన హామీ లభించాలన్నారు. దీంతో సమస్య ప్రతిష్టంభన కొనసాగుతోంది. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎంలు ఎ.కె.సోబ్తీ, జి.గాంధీ, జీఎం ఎస్.భాను, పలువురు ఉన్నతాధికారులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.


గంగవరం పోర్టు కార్మికులకు చేతులెత్తి నమస్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీజీఎం గాంధీ